క్లుప్తంగా

ధర్మ భిక్షం వర్ధంతి



రుద్రూర్: కోటగిరిలో రాష్ట్ర గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు విఠల్ గౌడ్, శ్రీధర్‌గౌడ్, వెంకాగౌడ్, పండరిగౌడ్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్ లోక్‌సభ బరిలో ఉండే కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలాని డీసీసీ కార్యదర్శి దేగ పోశెట్టి కార్యకర్తలకు సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన పథకాలపై ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూర్ మండలాధ్యక్షుడు ముక్కెర విజయ్, ఎడ్ల పోశెట్టి, బండారి రమేష్, నీలగిరి శ్రీనివాస్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో చలివేంద్రం ప్రారంభం



రుద్రూర్: కోటగిరిలో అభయహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఎండాకాలం ముగిసే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఫౌండేషన్ డైరెక్టర్ బర్ల మధుకర్, ఎంపీటీసీ కొట్టం మనోహర్, కొత్తపల్లి విండో చైర్మన్ సునీల్‌కుమార్ చౌదరి, మాజీ సర్పంచ్ బర్ల గంగారాం, మాజీ జెడ్పీటీసీ శివరాజుదేశాయ్, శ్రీనివాస్‌రావ్, షాహీద్, హన్మంతు, గణేష్, శ్రీధర్, సాయిలు, ఆనంద్ పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసీపేట్‌లో గల విజయ మేరీ పాఠశాలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం తహసీల్దార్ గంగాధర్ పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆర్‌ఐ వరుణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని విధుల బహిష్కరణ



బోధన్‌టౌన్: బోధన్‌లోని జిల్లా ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తక్షణమే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. ఆస్పత్రిలో సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పతున్నారన్నారు. నాయకులు శంకర్, నాగమణి, సతీష్, మాధవి, జియా, సాయిలు, దత్తు ఉన్నారు.

ఆర్థిక చేయూత



నవీపేట: నవీపేట బాలుర ఉన్నత పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ మిత్రుడికి చేయూత అందించారు. పాఠశాలలో చదివిన అభంగపట్నం గ్రామానికి చెందిన లచ్చయ్య కూతురు వివాహం నిశ్చయమైంది. దీంతో స్నేహితులు రూ. 30 వేలను జమ చేసి మంగళవారం అందజేశారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బెల్లాల్ చెరువు వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



అలీసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నాయకులు

బోధన్‌టౌన్: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. బోధన్ శివారులోని బెల్లాల్ చెరువును మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం నిజాంసాగర్ ప్రాజెక్టు అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. బెల్లాల్ చెరువుతో పాటు, అలీసాగర్ ప్రాజెక్టును నింపేందుకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. బోధన్ పట్టణ ప్రజల ప్రధాన తాగునీటి వనరు బెల్లాల్ చెరువని, ఈ చెరువులో ప్రస్తుతం నీటి మట్టం 930 అడుగులు ఉందన్నారు. నిజాంసాగర్ నుంచి వచ్చే నీటితో చెరువు నింపుకోవడానికి కాలువల మరమ్మతులు చేపడుతామన్నారు. దీనికి రైతులు సహకరించాలని సూచించారు. బెల్లాల్ చెరువును నిండటానికి ఇంకా మూడు ఫీట్ల నీరు అవసరం ఉందని, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ ఇచ్చే నీరు సరిపోకపోవడంతో మిషన్ భగీరథ నీరు సింగూరు నుంచి వస్తాయని తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా రెండు రోజుల క్రితం నిలిపి వేశారని, ఈ రోజు నుంచి నీరు సరఫరా అవుతుందన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఇరిగేషన్ డీఈ లోకేష్ నాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, కౌన్సిలర్‌లు తూము శరత్‌రెడ్డి, పాల్, డీసీసీ డెలికెట్ గంగశంకర్, నాయకులు ఇంద్రకరణ్, హన్మంత్‌రావ్ ఉన్నారు.

ఎడపల్లి: ఎండాకాలం దృష్టిలో పెట్టుకుని జూన్ వరకు ప్రజలకు తాగునీరు అందేలా చూస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎడపల్లి మండలం ఠానా కాలనీలోని అలీసాగర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని, రిజర్వాయర్‌లలో నీరు అడుగంటుతుందన్నారు. నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిజామాబాద్ పట్టణం పరిధిలో కొన్ని గ్రామాలను కూడా కలిపి నందున వాటిని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బోధన్ మున్సిపాలిటీలో కూడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, నాయకులు పులి శ్రీనివాస్, రామ్మోహన్, నారాయణ చౌదరి, ఎల్లయ్య యాదవ్, కిశోర్, రాజాగౌడ్, సాయిలు ఉన్నారు.

బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తూ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వేల్పూర్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ చెప్పిన 100 రోజుల గడువు ముగిసినందున ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతికహక్కు లేదని పేర్కొన్నారు. రైతులకు చెప్పిన రూ. 2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు పుష్కలమైన నీరు, 24 గంటల కరెంటు, రైతుబంధు ఇచ్చామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో, జిల్లాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పంటలు ఎండిపోతున్నా ఈ ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

కే సాట్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు కలాం ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం లక్కారం ప్రసాద్, లక్కారం సాగర్ మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఈ అభ్యాస్ అకాడమీ, నలంద పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 25నా కలాం ఆప్టిట్యూడ్ టెస్ట్ లెవల్-1, లెవల్-2 పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా 600 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. నలంద పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సీహెచ్ హనీరెడ్డి రాష్ట్రస్థాయలో మొదటి ర్యాంకు సాధించగా నాలుగో తరగతి విద్యార్థి పెరుగు యువరాజ్ మూడో ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను యాజమాన్యం సన్మానించింది.

పక్కాగా సామాజిక తనిఖీ



సమావేశంలో ట్రైయినీ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు

మాక్లూర్: ఉపాధిహామీ సామాజిక తనిఖీని పక్కాగా చేపట్టాలని ట్రైయినీ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ సమావేశాన్ని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఎంపీడీవో జె క్రాంతి అధ్యక్షతన నిర్వహించారు. ట్రైయినీ కలెక్టర్‌తోపాటు పీడీ సాయాగౌడ్, విజిలెన్స్ అధికారి నారాయణ, రాష్ట్ర రీసోర్స్ పర్సన్ రాఘవులు, ఏపీఎం ఓంకార్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధిహామీపనుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ.. జాబ్‌కార్డు లేని వారందరికీ కార్డులు ఇప్పటించాలన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటించాలన్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు చేపట్టి డబ్బులు రికవరీ చేయాలన్నారు. సమావేశంలో ఉపాధిహామీ ప్రోగ్రాం మేనేజర్ అశోక్, కె దత్తు, విశ్వనాథ్, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బుద్దె సావిత్రి

బోధన్‌రూరల్: బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాల్లో వేసవికాలంలో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుద్దె సావిత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల వారిగా అధికారులు గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల నివేదికలను వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక పాలనాధికారులు, జీపీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పీహెచ్‌సీలో పలు టీకాల కొరత ఉందని సంబంధిత అధికారులు టీకాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, తహసీల్దార్ గంగాధర్, ఎంపీవో మధుకర్ పాల్గొన్నారు.

నేలకూలిన క్రీడా ప్రాంగణం బోర్డు



పడిపోయిన క్రీడా ప్రాంగణం బోర్డు

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్‌లో క్రీడా ప్రాంగణం బోర్డు నేలకూలింది. గ్రామంలో వరద కాలువ అంచున ప్రభుత్వ భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ బోర్డు నేలమట్టం అయింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా అధికారులు తమ అనుకూలంగా బిల్లులు చేసుకోవడంతోనే బోర్డు నేలకూలినట్లు సమాచారం. అధికారులు మాత్రం ఎలా జరిగిందో తెలుసుకుంటామని చెబుతున్నారు. వాటాల కోసం బిల్లులు నిలిపివేయడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందని సమాచారం. దీనిపై పంచాయతీ కార్యదర్శి సాగర్‌ను వివరణ కోరగా బోర్డును ఎవరో కావాలనే నేలమట్టం చేశారన్నారు. వారిని గుర్తించి వారితోనే పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఐసీఎస్ఎస్ఆర్ ఫెలోషిప్‌లో ఓబీసీ కోటా అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ద్వారా నిర్వహించే ప్రాజెక్టు ఫెలోషిప్‌లో ఓబీసీ కోటాను అమలు చేయాలని భారతీయ ఛత్రపతి పూలే జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు చాదల్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ నెట్ ఫెలోషిప్ సంఖ్యను వేయి నుంచి ఐదు వేలకు పెంచాలని విన్నవించారు. పరిశోధక విద్యార్థులు గణేష్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ మారే యత్నం'



మాట్లాడుతున్న నాయకులు

వర్ని: అక్రమంగా సంపాదించిన ఆస్తులు కాపాడుకోవడానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం వర్ని, చందూర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆయన కుమారుడు చేసిన కాంట్రాక్టుల బిల్లులు రాబట్టుకోవడానికి, కుమారుల రాజకీయ భవిష్యత్తు కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాలు చేస్తున్నారని శ్రీనివాసరావు ఆరోపించారు. చందూర్ వైస్ ఎంపీపీ దశగౌడ్, వర్ని మండలాధ్యక్షుడు సురేష్, జాకోర సొసైటీ చైర్మన్ దశరథ్, మోహిన్, గంగప్ప, జలాల్పూర్ సాయిలు, చెంద దత్తు, రామకష్ణ పాల్గొన్నారు.

బడా రాంమందిరం భూముల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్రహ్మపురి(గాజుల్‌పేట్) బడా రాంమందిరం ఆవరణలో గల భూములను దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు బి కమల, ఈవో వేణు మంగళవారం పరిశీలించారు. మందిరం ఆవరణలో గల శ్రీ వేంకటేశ్వర విద్యాలయం పేరున 600పై చిలుకు చదరపు గజాలు ఉండగా, దీనిని దేవాదాయ అధికారుల ఆధ్వర్యంలో పంచనామ చేసి అట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ స్థలానికి సంబంధించి రికార్డులను ఈవో వేణుకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్, గంగాధర్, ఆంజనేయులు, కిశోర్, సుమన్, పోశెట్టి, సోమయ్య ఉన్నారు.

శ్రీరామ నవమి ఏర్పాట్లపై సమావేశం

ఏప్రిల్ 17న శ్రీరామ నవమి సందర్భంగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ సుప్రియ సమక్షంలో, ఆలయ ఈవో వేణు ఆధ్వర్యంలో బడా రాంమందిరంలో సమావేశం జరిగింది. ప్రతి సంవత్సరం బడా రాంమందిరంలో శ్రీ రామ జన్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వేడుకలు ఇందూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని తీర్మానం చేశారు. వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సుప్రియ ఆదేశించారు.

సన్మానాలు..

- ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌కు..



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. హైదరాబాద్‌లో ఆయనను కలిసి పద్మశాలి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు మోహన్‌దాస్, కొక్కుల రమాకాంత్, చిలివేరి రవి, శ్రీనివాస్, వేముల ప్రకాశ్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

- చైర్‌పర్సన్ దంపతులకు..



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన లావణ్య శ్రీనివాస్ దంపతులను మండల ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని చైర్ పర్సన్ నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. భరత్‌చంద్ర మల్లయ్య, ప్రవీణ్ పవార్, కాంతి గంగారెడ్డి, మానస గణేశ్, గోపికృష్ణ, నలంద ప్రసాద్, వంశీ, ఆలూర్ మల్లేష్ తదితరులు ఉన్నారు.

- ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంకు..



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు మట్ట రాజేందర్ దంపతులను మంగళవారం పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. మట్ట రాజేందర్ జక్రాన్‌పల్లి మండలం పడకల్ డీఎస్‌టీ తండా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ విరమణ పొందారు. పెర్కిట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజేందర్ దంపతులు సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, తుమ్మల లక్ష్మణ్ పటేల్, పెంట జలంధర్, రవీందర్‌రెడ్డి, గోపాల్, కిషన్, అశోక్, గోపి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

- తెయూ రిజిస్ట్రార్ యాదగిరి
- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్రీడలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి అన్నారు. 'నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ)' 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్సిటీ ఎన్ఎస్‌యూఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. పోటీలతో క్రీడాకారుల్లో దాగిన నైపుణ్యం వెలికివస్తుందని, స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీలు జరిగేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం, కాంట్రాక్టు అధ్యాపకులు దత్తహరి, శ్రీనివాస్, విద్యార్థి నాయకులు రాజేందర్, సాగర్ నాయక్, నిరంజన్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఓం భీం బుష్ (తెలుగు) - 4.05 లైన్‌మెన్ (తెలుగు) - 7.15 గామి (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	ప్రేమలు (తెలుగు) - 12.00, 3.15, 6.30, 9.45
స్క్రీన్-3 –	ఓం భీం బుష్ (తెలుగు) - 11.00, 2.10, 6.05, 9.15
స్క్రీన్-4 –	రజాకార్ (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00

చెరువులో దూకిన మహిళను కాపాడిన రైతులు

నందిపేట: కుటుంబ సమస్యలతో చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను స్థానిక రైతులు కాపాడారు. కామారెడ్డి జిల్లా లింగాయపల్లికి చెందిన విజయకు భర్త, కూతురు ఉంది. కుటుంబ సమస్యలు, భర్త వేధింపులు తాళలేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరిన విజయ మంగళవారం నందిపేట రఘునాథ చెరువులో దూకింది. అటుగా వెళ్తున్న రైతులు మచ్చర్ల సాగర్, ఉమ్మడ ట్రాక్టర్ ఊషన్న గమనించి ఆమెను కాపాడారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఖలీల్‌వాడి: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. మంగళవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రాత్రి పగలు తేడా లేకుండా సేవ చేస్తున్న ఆటో డ్రైవర్లను అభినందించారు. మద్యం తాగి ఆటోలు, ఫోన్ మాట్లాడుతూ ఆటోలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడి పడితే అక్కడ ఆటోలను నిలుపొద్దన్నారు. ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ, టౌన్ సీఐ నరహరి, ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన పండరీపూర్ పాదయాత్ర



మంగి రాములు మహరాజ్‌కు స్వాగతం పలుకుతున్న భక్తులు

నందిపేట్: నందిపేటలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ చేపట్టిన పండరీపూర్ పాదయాత్ర మంగళవారం ముగిసింది. ఈ నెల 11న ఆశ్రమం నుంచి పాదయాత్రగా బయలుదేరి 24న పండరీపూర్ చేరుకున్నారు. అక్కడ పూజలు చేసిన అనంతరం మంగళవారం ఉదయం నందిపేటలోని ఆశ్రమానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పాదపూజ చేశారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899